

నేడు యాసలపు సూర్యారావు వర్ధంతి సభ, కవితా గోష్టి

ప్రజాశక్తి-పెద్దాపురం

ప్రజా నాయకుడు, ప్రజా కవి యాసలపు సూర్యారావు 12వ వర్ధంతి సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో శనివారం సాయంత్రం యాసలపు వర్ధంతి సభ, అనంతరం కవితా గోష్టి నిర్వహిస్తామని సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ తెలిపారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణ బాబు అధ్యక్షతన జరిగే ఈ సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్, నాయకులు దువ్వా శేషబాబ్జి, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, జెవివి నాయకులు బి.అనంతరావు, యుటిఎఫ్ నాయకులు బేబీ గంగారత్నం, కార్యదర్శి జాన్ కెనడీ, పిఎన్‌ఎం నాయకులు మంతెన సత్తిబాబు, రొంగల వీర్రాజు, నీలపాల సూరిబాబు పాల్గొంటారని తెలిపారు.

కానరాని చినుకు జాడ

- అరకొరగా సాగునీటి లభ్యత
- సకాలంలో అందితేనే సాగు గట్టెక్కేది
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఈ ఏడాది కూడా వానలు ఆలస్యమవుతున్నాయి. వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ రుతుపవనాల జాడ కనిపించడం లేదు. మరోవైపు సాగునీటి లభ్యత అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. పూడిక తీత పనులు జరగకపోవడంతో ఈ నెల 1న కాలువలకు నీరు విడుదల చేసినప్పటికీ సాగునీరు అందని దుస్థితి నెలకొంది. దీంతో ఈ ఖరీఫ్ సీజన్ సకాలంలో పూర్తి అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో పంట చేతికందే సమయంలో ప్రకతి వైపరీత్యాలను తలచుకుని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 3.10 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. వరి 2,26,685 ఎకరాల్లో, మొక్కజొన్న 587 ఎకరాల్లో, అపరాలు 2667 ఎకరాల్లో, పత్తి 7,992 ఎకరాల్లో, చెరకు 5,520 ఎకరాల్లో సాగు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగు కోసం రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలాలను దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు. ముందస్తుగా సాగు పనులకు సిద్ధమవుతున్న తరుణంలో వానల ఆలస్యం అశనిపాతంగా మారుతుంది. అటు మెట్ట, ఇటు డెల్టా ప్రాంతాల్లో సాగుకు అనుగుణంగా పరిస్థితులు ఏర్పడతాయని ఆశిస్తే అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తున్న తరుణంలో ఆవేదన చెందుతున్నారు. జూన్ నాలుగో వారం వచ్చినా రుతుపవనాలు పూర్తిగా వ్యాపించలేదు. అంతకముందు కురిసిన అడపాదడపా వర్షాలు మినహా పూర్తిస్థాయిలో వ్యవసాయానికి అనుగుణంగా వానలు పడిన పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో సాగునీటి లభ్యత కూడా అంతంతమాత్రంగానే కనిపిస్తుంది.

వర్షాధార పంటలపై ప్రభావం

ఏటా జూన్ మొదటి వారంలోనే రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. కేవలం నైరుతి రుతుపవనాల కాలంలోనే సగటున 1000కి పైగా మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతోంది. జూన్ నెలాఖరు నుంచి జూలైలో భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువ ఉంటాయి. కానీ ఈసారి అలాంటి పరిస్థితులు రాలేదు. వర్షాలు రాకపోతే మెట్ట ప్రాంతాల్లో వర్షాధార పంటలు సాగుచేస్తున్న రైతులు, అటు ఏజెన్సీలోనూ, ఇటు మెట్ట ప్రాంతంలోనూ వాన కోసం ఎదురు చూపులు తోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సాగు అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దమ్ము చేసి సాగుకు చేనును సిద్ధం చేసిన రైతు

సకాలంలో సాగునీరు అందితేనే..

మెట్ట ప్రాంతంలో పత్తి, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలన్నింటికీ వర్షాలు సకాలంలో కురిస్తేనే పంట చివర్లో తుపాలను బారిన పడకుండా గట్టెక్కే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. డెల్టాలో కూడా సకాలంలో సాగునీరు అందితే సెప్టెంబరు, అక్టోబరు నాటికి తుపానులు, వరదల నుంచి గట్టెక్కవచ్చునని ఆశిస్తున్నారు. కానీ ఇప్పుడు మాత్రం వాతావరణం అందుకు సహకరించడం లేదు. ఈ ఏడాది కూడా ఖరీఫ్‌లో ఎటువంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అరకొరగానే సాగునీరు

జూన్ 1నే గోదావరి డెల్టాలో సాగునీటి కోసం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేసినప్పటికీ అంతంతమాత్రంగానే లభిస్తోంది. కాకినాడ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం కొన్ని మండలాల్లో కొంతమేర మాత్రమే నారుమళ్లు సిద్ధం చేశారు. ఈ సమయానికి సుమారు వెయ్యి ఎకరాల్లో నారు మళ్లు సిద్ధం చేయాల్సి ఉండగా నీటి లభ్యత సక్రమంగా లేకపోవడంతో సుమారు 600 ఎకరాల్లో మాత్రమే సిద్ధమయ్యాయి. వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే 250 ఎకరాల్లో వెదజల్లు సాగు పూర్తి కావలసి ఉండగా ఇప్పటి వరకు సుమారు 50 ఎకరాల్లో మాత్రమే వేశారు. అయితే రైతులు ఎక్కువగా బెంగాల్ ఊడుపులకు మొగ్గు చూపుతున్నారు. సాగునీరు గనుక పూర్తిస్థాయిలో లభ్యమైతే జూన్ నెలాఖరు నుంచి నాట్లు ప్రారంభమై జూలై నెలాఖరుకు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పుడున్న ఇబ్బందులను బట్టి చూస్తే ఆగస్టు చివరి నాటికి కూడా నాట్లు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. గోదావరి కాలువలతో పాటు ఏలేరు, బిబిసి, పుష్కర కాలువల ఆధునీకరణ లేకపోవడంతో రైతులు ప్రతి సంవత్సరం అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. నూతన ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతో పాటు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అసెంబ్లీలో ఎంఎల్‌ఎల ప్రమాణ స్వీకారం

అమరావతిలో అసెంబ్లీలో జిల్లాకు చెందిన ఆరుగురు ఎంఎల్‌ఎలు శుక్రవారం ప్రమాణ స్వీచారం చేశారు. వారితో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణం స్వీకారం చేయించారు. పిఠాపురం ఎంఎల్ఎ పవన్ కల్యాణ్, జగ్గంపేట ఎంఎల్ఎ నెహ్రూ, పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప, ప్రత్తిపాడు ఎంఎల్ఎ సత్యప్రభ, తుని ఎంఎల్ఎ దివ్య, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ నానాజీ ప్రమాణ స్వీకారం చేశారు.



పవన్ కల్యాణ్



జ్యోతుల నెహ్రూ



నిమ్మకాయల చినరాజప్ప



వరుపుల సత్యప్రభ



యనమల దివ్య



పంతం నానాజీ

యాసలపు బాటలో ఉద్యమాల బలోపేతం

ప్రజాశక్తి-పెద్దాపురం

ప్రజా నాయకుడు యాసలపు సూర్యారావు బాటలో ప్రతి కార్యకర్త పయనుంచి కార్మిక ఉద్యమాలను బలోపేతం చేయాలని సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం కరణం ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన యాసలపు వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సూర్యారావు కార్మికుల పక్షాన నిలబడి నిరంతర పోరాట యోధునిగా గుర్తింపు పొందారన్నారు. ప్రజాకవిగా సామాజిక అంశాలపై నిరంతరాయంగా రచనలు చేశారన్నారు. తొలుత యాసలపు సూర్యారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'భారత జాతీయ ఉద్యమం- సమకాలీన రాజకీయాలు' అనే అంశంపై జరిగిన సదస్సులో శర్మ మాట్లాడారు. భారతదేశంలో రాజ్యాంగం, లౌకికవాదం ప్రమాదంలో పడ్డాయన్నారు. వీటిని కాపాడుకోవటం ద్వారానే దేశాన్ని రక్షించుకోగలమన్నారు. దేశంలో బిజెపి మతం పేరుతో రాజకీయాలు జరుపుతూ విభజించు పాలించు విధానాలను అమలు చేస్తోందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన ఆర్థిక విధానాలు అవలంబిస్తూ వారికి లక్షల కోట్లు మాఫీ చేస్తోందన్నారు. ప్రజలపై మార్కెట్ భావజాల ఆధిపత్యం పెరిగిందన్నారు. పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర లేదని, కార్మిక హక్కులు సైతం కాలరాశారని చెప్పారు. ఈ సదస్సులో ప్రజా నాట్యమండలి కళాకారులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, దారపురెడ్డి కృష్ణ గీతాలు ఆలపించారు. ఈ సదస్సులో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, డి.క్రాంతి కుమార్, కేదారి నాగు, కూనిరెడ్డి అరుణ, చల్లా విశ్వనాథం, గడిగట్ల సత్తిబాబు, దాడి బేబీ, జోస్యుల కృష్ణబాబు పాల్గొన్నారు.



సూర్యారావుకు నివాళి అర్పిస్తున్న ఎంవిఎస్.శర్మ, నాయకులు

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీపై వినతి

ప్రజాశక్తి-కాకినాడ

జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్లలో ఫీజు రాయితీ కల్పించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్‌రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను కోరారు. శుక్రవారం కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందింఆచరు. జర్నలిస్టుల పిల్లలకు గతంలో ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో 50 శాతం ఫీజు రాయితీ ఉండేదని, మరలా 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తే జర్నలిస్టుల పిల్లలకు ఎంతో మేలు జరుగుతుందని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జె.నివాస్ విద్యాశాఖ అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా నాయకులు వీధి గోపీనాథ్, దాసరి శ్రీనివాస్, సత్య, పుర్రె త్రినాధ్, సుధీర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఇపిఎఫ్ చట్టాల్లో మార్పులు తగవు

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు నష్టం చేకూర్చే విధంగానూ, యజమానులకు లాభాలు చేకూర్చే విధంగానూ చట్టాల్లో మార్పులు చేయడం తగదని సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, కాకినాడ నగర అధ్యక్షులు పలివెల వీరబాబు ఒక ప్రకటనలో విమర్శించారు. కార్మికుల జీతాల నుంచి మినహాయించిన ఇపిఎఫ్, ఇడిఎల్ఐ కంట్రిబ్యూషన్‌లను ఇపిఎఫ్‌కు డిపాజిట్ చేయడంలో యజమానులు ఆలస్యం చేసిన లేదా డిఫాల్ట్ చేసినా వారిపై పెనాల్టీలు వేసి ఛార్జీలు వసూలు చేయడం ఇప్పటివరకు ఉన్న చట్టం. ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం యజమానులు అనుకూలంగా మార్పులు చేసి, వారు కట్టవలసిన కంట్రిబ్యూషన్‌ను పిఎఫ్ బోర్డు, పెన్షన్ బోర్డ్‌కు సరైన టైమ్‌లో చెల్లించకపోయినా వారిపై వేసే పెనాల్టీలను పూర్తిగా తగ్గించే విధంగా చట్టాల మార్పులు చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతోందన్నారు. పిఎఫ్ బోర్డు, పెన్షన్ బోర్డుకు కార్మికుల వాటాను, యజమాని వాటాను సరైన టైమ్‌లో చెల్లించకపోతే పిఎఫ్ బోర్డ్, చెల్లించని యజమానులపైన పెనాల్టీతో సహా వసూలు చేసే పని పిఎఫ్ అధికారులు చెయ్యాలి కానీ నూతనంగా పెనాల్టీలను పూర్తిగా తగ్గిస్తూ సవరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దీనివల్ల యజమానులు కార్మికులకు, పిఎఫ్ బోర్డుకి, పెన్షన్ బోర్డుకి చెల్లించాల్సిన మొత్తాలను మొత్తంగా ఎగవేస్తే దానివల్ల కార్మికులు మరింత నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన ఈ సవరణలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మికులకు అండగా పోరాటాలు నిర్వహిస్తామని కార్మిక నాయకులు హెచ్చరించారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోట రాక్షరామిక్స్ యాజమాన్యం కార్మికులను తొలగించి 65 రోజులు పూర్తి అయిన తరువాత కూడా విధుల్లోకి తీసుకోకుండా చర్చల ద్వారా కాలయాపన చేస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్ విమర్శించారు. రాక్ సిరామిక్స్ యాజమాన్యం కార్మికులను అక్రమంగా తొలగించిందని కాని విధుల్లోకి తీసుకోవడానికి మాత్రం కాలయాపన చేస్తూ కార్మికులపై ఒత్తిడి చేస్తోందనిన్నారు. కంపెనీ గేటు ముందు 11వ రోజు కార్మికులు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. గేటుముందు కూర్చోకూడదంటూ యాజమాన్యం కార్మికులతో వాదనకు దిగింది. అయినా గేటు ముందు నిరసన తెలియజేసే హక్కు తమకు ఉందని, కంపెనీ నుంచి అక్రమంగా ఎందుకు తొలగించారో వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్‌రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.



శిబిరం వద్ద కార్మికులతో మాట్లాడుతున్న క్రాంతి కుమార్

ఘనంగా యోగా దినోత్సవం

జిల్లావ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

కాకినాడ ప్రజల దైనంతిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవడం ద్వారా అద్భుత ప్రయోజనాలు పొందవచ్చని కలెక్టర్ జె.నివాస్ పేర్కొన్నారు. జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో మున్సిపల్ ఇండోర్ స్కేటింగ్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ జె.నివాస్ హాజరై యోగాసనాలు సాధన చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచఎం తోటకూర సాయి రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం విద్యార్థులకు యోగాసనాల గురించి వివరించారు.ఉపాధ్యాయులు వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ, కెవివి.సత్యనారాయణ, ఎఎల్.వి.కుమారి, కె.శ్రీనివాస్, శ్రీవల్లి, వల్లి, బి.శ్రీలక్ష్మీ, సిహెచ్.భద్ర, పి.బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి హాజరయ్యారు. న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో యోగా గురువు ఎస్‌వి.రమణ పలు యోగాసనాలు వేయించారు. సీనియర్ సివిల్ జడ్జ్ ఎం.బాబు, మెజిస్ట్రేట్ ఎం.విజయ రామేశ్వరి, బార్ అసోసియేషన్ సభ్యులు ఎకెవై రెడ్డి పాల్గొన్నారు. ఆర్‌ఆర్‌బి హెచ్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.కేశవరావు, నెహ్రూ యువజన కేంద్రం ప్రతినిధి అనూష, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ కాశీ విశ్వనాథం, అధ్యాపకులు ఎం.సుంద రయ్య, బుల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ భారత్ స్కౌట్స్, గైడ్స్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఎంవివి.సత్యనారాయణ పండూరు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రకాశిని అధ్యక్షతన యోగా డే నిర్వహించారు.


సామర్లకోట అచ్చంపేట ఎంపిపి పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఆయుర్వేద డాక్టర్ షాజిద్ అలీ, పెద్ద బాబు , గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, వెంకన్న బాబు, వీరబాబు, రమేష్ పాల్గొన్నారు. **పెద్దాపురంలో** 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్ధన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.బుల్లెమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాళ్లరేవు కోరింగ ఫార్మసీ కళాశాల, ప్రాథమికోన్నత పాఠశాలలలో యోగా డే ఘనంగా నిర్వహించారు. కోరంగి హోమియో వైద్యశాల వైద్యులు ఎం.విజయ ప్రతిభ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సువర్ణ జ్యోతి, డైరెక్టర్ చిట్టూరి కలికి మూర్తి, స్కూల్ హెచ్‌ఎం ఉమా మహేశ్వరి పాల్గొన్నారు. బొడ్డుచినవెంకటాయపాలెం హైస్కూల్లో హెచ్‌ఎం సాయి ప్రసాద్ పాల్గొన్నారు.



కాకినాడలో యోగాసనాలు అభ్యాసం చేస్తున్న కలెక్టర్ నివాస్

కార్టూ'నిజం'



తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేయించాలి

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలోని అన్ని గ్రామాల్లో సురక్షితమైన తాగునీరు అందించేలా నూరు శాతం తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేయించాలని కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆయన క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మండల స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న సమావేశాలు, తాగునీరు సరఫరాలో వివిధ గ్రామాల్లో ఎదురైన సమస్యలు వాటి పరిష్కారం, మంచినీరు ట్యాంకులకు క్లోరినేషన్, మురికి కాలువల్లో ఉన్న వాటర్ పైపులైన్ల ప్రస్తుత పరిస్థితి, మంచినీరు పరీక్షలు, సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో నిర్వహించాల్సిన కార్యకలాపాలపై ఆయన సమక్షించారు. తాగునీరు సమస్యల పరిష్కారం, మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై ప్రతి సోమవారం మండల స్థాయిలో సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. క్లోరినేషన్ చేసిన తేదీ, ఫోటోల వివరాలు పంపించాలన్నారు. గ్రామస్థాయిలో ప్రతి వీధిలో ఉన్న తాగునీటి పైపులైన్లు, మురికి కాలువల కింద ఉన్న పైపులైన్ల ప్రస్తుత పరిస్థితిని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలు పంపించాలన్నారు. తాగునీరుకు సంబంధించి మెట్ట ప్రాంత గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముందస్తు చర్యలతో డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులను దాదాపుగా అరికట్ట వచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిపిఒ కె.భారతి సౌజన్య, సిఇఒ జిస్.రామ్‌గోపాల్, ఎస్ఇ ఎం.శ్రీనివాసు, పి.నారాయణ మూర్తి, కెఎన్‌వి.ప్రసాద్ రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్



గరగలకు మంచంపై పొన్ను

ఘనంగా మరిడమ్మ ఉయ్యాల తాళ్ల ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి జాతరలో భాగంగా శుక్రవారం ఉయ్యాల తాళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి, సిహెచ్.రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఈ ఉత్సవం నిర్వహించారు. పాత పెద్దాపురానికి చెందిన యువకులు వార్షిక సాంప్రదాయంలో భాగంగా పొలాల్లో నరికిన తాడి చెట్లకు మోకులు కట్టి గరగల నృత్యాలు, డప్పుల విన్యాసాల మధ్య ఆలయం వరకు మోసుకుంటూ తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో నందిక లోవరాజు, పప్పుల అబ్బులు, ఇజ్జన పెద్ద, అయితి మమ్మీ, బచ్చుల ఏసుబాబు, ఇజ్జన ఆంజనేయులు, పిల్లి నూకరాజు, వజ్రపు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్‌లో పాల్గొన్న ఎంఇఒలు, సిడిపిఒ

ప్రభుత్వ విద్యతో ఉన్నత స్థితి సాధ్యం

ప్రజాశక్తి -సామర్లకోట

చిన్నారుల ఉన్నత భవిష్యత్‌కు ప్రభుత్వ విద్యే సరైన మార్గమని ఎంఇఒ-2 పి.పుల్లయ్య, సిడిపిఒ ఉష అన్నారు. ఉండూరు, అచ్చంపేటలో అయిదేళ్లు నిండిన అంగన్‌వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్, వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా ఎంఇఒ పుల్లయ్య, సిడిపిఒ ఉష పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదుకునే విద్యార్థులు మానసిక ప్రశాంతత కలిగి ఉంటారన్నారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యాభ్యాసం చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఆహ్లాద వాతావాతణంలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి వారి ఉన్నత భవిష్యత్‌కు తల్లిదండ్రులు దోహద పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్మల కుమారి, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

భారతీయ సంగీతానికి ప్రపంచంలో మేటి స్థానం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

భారతీయ సంగీతానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉందని తల్లిదండ్రులు పిల్లలకు సంగీతాన్ని నేర్పించి భావితరాలకు అందించాలని సంగీత విద్వాంసురాలు చావలి సూర్య కుమారి పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సంగీతంతో మనసుకు సాంత్వన చేకూరు తుందన్నారు. సంగీత సాధనతో క్రమ శిక్షణతో పాటు మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. మరో సంగీత విద్వాంసురాలు సి.దుర్గా మహాలక్ష్మి మాట్లాడుతూ సంగీతం నేర్చుకోవడానికి వయసు తారతమ్యత లేదన్నారు. సంగీత సాధనతో దీర్ఘకాలిక రోగాలు కూడా నయమవుతాయన్నారు. సంప్రదాయ కళల పట్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా వారు సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ పట్నాయక్, రాజా, చింతపల్లి సుబ్బారావు, ఎస్.శ్రీనగేష్, కొమ్మూరి శ్రీనివాసరావు, పి.పార్థసారథి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

తూర్పుగోదావరి జిల్లా సెబ్ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని దొండపూడి గ్రామంలో శుక్రవారం దాడులు నిర్వహించినట్లు సెబ్ సిఐ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో 20 లీటర్ల నాటు సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఆయన వెంట ఎస్ఐ పి .సుధీర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఘటన స్థలంలో సుబ్బారావు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

216(ఏ)నెంబరు జాతీయ రహదారిపై చెముడులంక ధనలక్ష్మి ఆలయం ఎదురుగా గురువారం అర్ధరాత్రి బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒక రైతు మతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని చెముడులంకకు చెందిన గల్లా సుబ్బారావు (56) రైతువారి పనులు చేసుకుంటూ ఉంటారు. ఎప్పటిలాగే తన పొలంలో పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో బైక్ పై రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో రాజమహేంద్రవరం వైపు నుండి రావులపాలెం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైకును ఢీకొంది. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే సుబ్బారావు మృతి చెందరన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న హైవే పోలీస్ సిబ్బంది,నేషనల్ హైవే రోడ్ సేఫ్టీ సిబ్బంది కలిసి ట్రాఫిక్ ను నియంత్రించారు.



డీజిల్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

డీజిల్ స్వాధీనం : డ్రైవర్ అరెస్టు

ప్రజాశక్తి -కాజులూరు

అక్రమంగా తరలిస్తున్న డీజిల్‌ను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు రాజమండ్రి విజిలెన్స్ ఎస్ఐ టి.జగన్ మోహన్ రెడ్డి, ఎంఎస్ఒ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. కోలంక వద్ద సాధారణ తనిఖీల్లో భాగంగా యానాం నుంచి పెదపూడి వెళుతున్న వ్యాన్‌ను తనిఖీ చేయగా 16 పీపాల్లో ఉన్న 3200 లీటర్ల డీజిల్‌ను గుర్తించామని తెలిపారు. గొల్లపాలెం స్టేషన్‌లో వ్యాన్, డ్రైవర్‌ను అప్పగించి ఐఒసి పెట్రోల్ బంక్‌లో డీజిల్ అప్పగించినట్లు ఆయన తెలిపారు. డీజిల్ విలువ రూ.2,72,000 ఉంటుందని వారు తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది కుమార్, కిషోర్, విఆర్ఒ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యానాం వార్తలు

కామిశెట్టి సావిత్రికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచ్ కాలంలో మేయర్‌గా పని చేసిన కామిశెట్టి సావిత్రి వర్ధంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమెకు ఘనంగా నివాళుర్పించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాజశేఖరన్, పైడికొండల రాజబాబు, భగవాన్, కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఫ్రీజర్ బాక్స్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్లు కొంతకాలంగా పని చేయడం లేదని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పుదుచ్చేరి హోమ్ శాఖమంత్రి నమశ్శివాయం, ఆరోగ్యశాఖ అధికారి శ్రీరాములతో ఫోన్లో మాట్లాడినట్లు పేర్కొన్నారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని వారం, పది రోజుల లోపు నూతన ఫ్రీజర్ బాక్స్ లను ఏర్పాటు చేస్తామన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

ప్రజాశక్తి-యానాం



మిషన్ శక్తి ఆధ్వర్యాన యోగా డే

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాజశేఖరన్, ప్రభుత్వ ఆసుపత్రి డిడిటి రవి శంకర్, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐ, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మిషన్ శక్తి కో ఆర్డినేటర్ రిపిక రోజెలిన్ ఆధ్వర్యంలో యోగా విశిష్టతను వివరించారు. వారితో యోగ ఆసనాలు వేయించారు. ప్రభుత్వాసుపత్రిలో డిడి రవిశంకర్ ప్రసాద్, మిషన్ శక్తి బృందం సభ్యులు మహాలక్ష్మి, సత్య సుధ, తేజస్విని, పుణ్య లక్ష్మి, విజయ కుమారి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానం

ప్రజాశక్తి - యానాం

స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్, సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో ఖాళీ సీట్లను ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ వేలాయుధం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చేవారు ఈ నెల 26నఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు హాజరవ్వాలని కోరారు. ఈ అవకాశాన్ని పుదుచ్చేరి, ఇతర రాష్ట్ర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వేణును అందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యాపక బృందం

అమరావతి విట్‌లో వేణుకు ప్రవేశం

ప్రజాశక్తి-కాజులూరు

అమరావతి విట్ కళాశాలలో కాజులూరు విద్యార్థిని కేతా వేణుకు ఉచిత ప్రవేశం లభించిందని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కాజులూరు ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన వేణును సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన అమరావతి విట్ కళాశాలలో బి.టెక్ చదివేందుకు కేత వేణు ఉచిత ప్రవేశం లభించిందని నాలుగు ఏళ్లపాటు ఎటువంటి ఫీజులు చెల్లించకుండా చదివేందుకు అవకాశం కలిగిందన్నారు. ఇంటర్మీడియట్లో 1000 మార్కులకు 974 మార్కులు సాధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రభుత్వ కళాశాలలలో అత్యధిక మార్కులు సాధించినట్టు తెలిపారు.

వైసిపి శిలాఫలకాలు ధ్వంసం

అనుమానంతో ఇద్దరు టిడిపి వ్యక్తులపై దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వెంకటాయపాలెంలో గుర్తు తెలియని వ్యక్తులు నూతన సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైసిపి పార్టీకి చెందిన శిలాఫలకాలను, జెండా దిమ్మను గురువారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. దీనిపై ఆ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా శిలాఫలకం, జెండా దిమ్మను పగుల గొట్టారనే అనుమానంతో టిడిపికి చెందిన అయినాల మణికంఠ, అయినాల వేణులపై కొందరు దాడి చేశారు. గాయపడిన వారిని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు, టిడిపి నాయకులు తెలిపారు.

ఫిషింగ్ హార్బర్ పరిశీలన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి



గట్టును పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం నూతనంగా నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేట ముగించుకుని వస్తున్న మత్స్యకారులకు అనువైన స్థలం లేకపోవడంతో గట్టుకు ఢీకొని బోట్లు ధ్వంసం అవడమే కాక మత్స్యకారులు ప్రాణాలు సైతం కోల్పోతున్నారని తెలిపారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళి ఇక్కడ సమస్యను తెలుపుతామన్నారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు అనిశెట్టి సత్యానంద రెడ్డి, చోడిపల్లి ప్రసాద్, కొర్ని రమణ, సూరాడ రాజు ఉన్నారు.

పవన్ కళ్యాణ్ నిర్ణయంపై కుడుపూడి హర్షం

ప్రజాశక్తి-తాళ్లరేవు

ఉపాధి హామీ పథకానికి వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేస్తూ డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఎఎంసి మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ హర్షం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అత్తిలి బాబూరావు, విళ్ళ వీరతో కలిసి ఆయన పి.మల్ల వరంలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ రంగం బలోపే తానికి ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత ఉపకరిస్తుం దన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-మామిడికుదురు

పాము కాటుకు మహిళ మృతి చెందింది. వివరాలు ఇవి.. పాశర్లపూడి బాడవ కు చెందిన వనమాడి అంజలీదేవి (38) ఈనెల 20న ఉదయంసమయంలో ఇంటివద్ద వాకిలి తుడుస్తోంది. ఈ సమయంలో విషసర్పం ఆమెను కాటువేసింది. దీంతో అమలాపురం శ్రీనిధి ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్టు ఆమె భర్త శ్రీమన్నారాయణ నగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు నగరం ఎస్ఐ సురేశ్ తెలిపారు.

పాతకోట గ్రామంలో తాగునీటి సమస్య

వారం రోజులుగా రంగు మారిన నీరే సరఫరా

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని పాతకోట గ్రామంలో మంచినీటి సమస్య ఉత్పన్నమైంది. ఇక్కడ గత వారం రోజులుగా మంచినీరు రంగు మారి సరఫరా అవుతోంది అని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు మంచినీటి చెరువులో నీళ్ల అయిపో యినప్పటికీ నేటికీ చెరువులో మంచి నీటిని నేటికీ నింపలేదని, దీంతో రంగు మారిన నీళ్ల సరఫరా అవుతున్నాయని గ్రామస్తుడు కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం 'ప్రజాశక్తి'కి తెలిపారు. వెంటనే చెరువును మంచినీటితో నింపి మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని రక్షిత మంచినీటిని స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామ కార్యదర్శి వివరణ

మంచినీటి రంగు మారడం చెరువులో నీరు లేకుండా పోవడంపై గ్రామ కార్యదర్శి శీతంశెట్టి సుబ్బారావు ను వివరణ కోరగా చెరువులో వేసవిలో మంచినీరు అయిపో యిందన్నారు. ప్రస్తుతం ఫిల్టర్ బెడ్ లో శుభ్రపరిచామని అన్నారు. మిగిలిన నీటిని పూర్తిగా ఇంజన్లతో తోడించి, మంచినీటిని నింపుతామని, నీరు తక్కువగా ఉండటం వల్ల ఫిల్టర్ అయినప్పటికీ రంగు మారి నట్లు కనిపిస్తున్నాయని అన్నారు. అయితే నీటి స్వచ్ఛత కోసం కలపాల్సిన లిక్విడ్స్ ను కలిపితే నీరు తెల్లగా మారుతుందని, ఫిల్టర్ బెడ్లను శుభ్రపరిచి సిద్ధంగా ఉంచామన్నారు. నాలుగు ఐదు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని కార్యదర్శి వివరించారు.



నీరు లేకుండా ఎండగట్టిన మంచినీటి చెరువు
(ఇన్‌సెట్)లో రంగు మారిన తాగునీరు